క్లుప్తంగా

నేడు సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కల్లూరు ఆదిత్య విద్యా నిలయంలో సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. భాగ్యనగరానికి చెందిన ఆర్థో, న్యూరో, ఆక్యూప్రెజర్ నిపుణులచే ఉచిత చికిత్స ద్వారా సమస్యలకు పరిష్కారం చూపుతారు. మరిన్ని వివరాలకు 89198 01926, 98859 71077 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

10న ఏపీ లైబ్రరీ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ 109వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ పటమటలోని శ్రీ సర్వోత్తమ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు కె.చంద్రశేఖర కల్కూర తెలిపారు. ఎండోమెంట్ లెక్చరర్ డాక్టర్ పి.ఎస్.జి. కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పూర్వపు ప్రొఫెసర్ డాక్టర్ చెన్నుపాటి కె.రామయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డిలు అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

14న అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు

కర్నూలు కల్చరల్: స్థానిక భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 14వ తేదీన శ్రీ అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమేష్ గురుస్వామి, మధుసూదనరెడ్డి గురుస్వామి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు పంచామృతాభిషేకం, సాయంత్రం 6 గంటలకు భజన, పూలంకి సేవ, పడిపూజ, అల్పాహార ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. శేషు యాదవ్ బ్రదర్స్‌చే ప్రత్యేక భజన ఉంటుందని తెలిపారు.

బీజేపీ సామాజిక వారోత్సవాలు



బీజేపీ సీనియర్ నాయకుడిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14వ తేదీ వరకు సామాజిక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ పేర్కొన్నారు. అందులో భాగంగా కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఆనటి జనసంఘ్ పార్టీ (నేటి బీజేపీ)లో పనిచేసిన జేష్ఠ కార్యకర్తలుగా ఉన్న నంద్యాల గోపాల కృష్ణయ్య, గుజరాతి నాగప్పలను వారి వారి స్వగృహాల్లో ఘనంగా సన్మానించారు. కర్నూలు అసెంబ్లీ కన్వీనర్ రంగస్వామి, జిల్లా విస్తారక్ గోపాలకృష్ణ స్వామి, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవదాయశాఖ ఖాళీ స్థలానికి బహిరంగ వేలం

కర్నూలు కల్చరల్: కల్లూరు మండలం కల్లూరు శ్రీ ఈశ్వర వీరభద్ర, భీమేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి సంబంధించిన భూమి సర్వే నంబర్ 145, 293 ప్లాట్ నంబర్ 1,2,3,4లలో 4.03 ఎకరాల ఖాళీ స్థలం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో గుర్రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల కాలానికి భారీ వాహనాలు నిలుపుకునేందుకు మాత్రమే లీజుకు ఇస్తామన్నారు. దేవదాయ శాఖ నిబంధనలను అనుసరించి వేలం జరుగుతుందని తెలిపారు.

రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

కర్నూలు(న్యూటౌన్) : ఎదురూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు రౌడీషీటర్లు పాట్టేళ్ల చోరీకి యత్నించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంజనేయ, వీరభద్ర, రామేశ్వరస్వామి ఆలయాల చైర్మన్ బోయ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గతంలో కూడా ఆ ఇద్దరు దొంగతనాలకు పాల్పడ్డారని చెప్పారు. శనివారం సాయంత్రం సీతారాముల, శివాలయం వద్ద గ్రామ ప్రజలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : దసరా,రావణాసుర, మీటర్, ది పోప్స్ ఎక్సార్సిస్ట్, బలగం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: ది పోప్స్ ఎక్సార్సిస్ట్, మీటర్, దసరా, రావణాసుర, దాస్ కా ధమ్కీ, దేశముదురు
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సర్, దసరా, రావణాసుర
ఐనాక్స్: ది పోప్స్ ఎక్సార్సిస్ట్, ది సూపర్ మారియో బ్రదర్స్, జాన్ విక్ చాప్టర్-4, రావణాసుర, భోలా
భరత్ కాంప్లెక్స్: బలగం, దాస్ కా ధమ్కీ, దేశముదురు
రాజ్ : రావణాసుర
శ్రీరామ : మీటర్
విజయ: మీటర్

దీక్షాదారులకు 'సహెరీ'

- రోజా ఉంటున్న వాళ్ల కోసం నగరంలో ఏర్పాట్లు
- ఉచితంగా అన్నదాన కార్యక్రమ నిర్వహణ

'అస్సలాము అలైకుమ్ భాయ్. క్యాభాయ్ ఆప్ రోజా రఖే హో?. వాలైకుమ్ అస్సలామ్. హా మైతో రోజా హు. క్యా ఆప్ భీ రోజా హో?. నహీ భాయ్. సహెరీకా ఇన్‌తెజామ్ ముష్కిల్ లగా. ఘర్‌వాలినే గావ్ చలేహై. ఇష్ లియే నహి. బడే భాయ్.. సహెరీకా ఇన్‌తెజామ్‌తో హమారె ఇస్ షహర్‌లో హోతేహై. ఫలా మస్‌జీదోమే ముఫ్తేమే హోతాహై. అచ్ఛ బహుత్ ఖుషీకి బాత్‌హై. కల్‌సే వహీపర్ సహెరీ ఖాకే రోజా రఖుంగా'.

కర్నూలు(రాజ్‌విహార్): ఉపవాస దీక్ష ఉండే ముస్లిం సోదరుల సేవలో పలు మసీదులు, స్వచ్ఛంద సంస్థలు తరిస్తున్నాయి. పవిత్రరంజాన్ మాసంలో రోజా ఉండడం ఎంతో పుణ్యమో.. వారి దీక్షలకు తగిన సహకారం అందించడం అంతకు మించి పుణ్యం లభిస్తుందని పవిత్ర ఖురాన్ బోధిస్తోంది. రోజా ఉండే వాళ్లు అర్ధరాత్రి 3 గంటలకు నిదుర లేచి సహెరీ కోసం ఆహారాన్ని వండుకోవాలి. ఇది కుటుంబసభ్యులకు సాధ్యమయినా.. ఇంట్లో మహిళలు లేని పురుషులకు, విద్యార్థులు, ఒంటరిగా ఉన్న వాళ్లకు ఇబ్బందికరమే. అలాంటి వాళ్ల కోసం కొన్ని మసీదులు, కొన్ని హోటళ్లు, స్వచ్ఛంద సంస్థలు సహెరీ ఏర్పాటు చేసి ఉపవాస దీక్షలు ఉండే వాళ్లకు భోజనాలు పెడుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ముస్లింలు ఉన్న నగరం కర్నూలు. ఉమ్మడి జిల్లాజనాభాలో దాదాపు 20శాతానికి పైగా ఉన్నారు.



వంటలు ఇలా...

రంజాన్ సందర్భంగా నగరంలో సహెరీ సందడి ఉంటోంది. తెల్లవారు జామున 3:30 నుంచి 4:50గంటల మధ్య ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు కిచిడీ, కీమా, రోటీ, చపాతి, పరోట, దాల్, అన్నం తదితర వంటకాలు చేసి వడ్డిస్తున్నారు. గతంలో ఇఫ్తార్ విందులే ఇచ్చేవారు. కాని పదేళ్ల క్రితం నుంచి సహెరీ చేయిస్తున్నారు. సహెరీ చేయిస్తే అధిక పుణ్యం లభిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

సహెరీ ఏర్పాట్లు ఎక్కడంటే...

- నగరంలోని ఖూబ్‌సూరత్ మసీద్, లాల్ మసీదు వద్ద, కర్నూలు.
- నూరానీ మసీద్, పెద్దమార్కెట్.
- డాక్టర్ మియా హత్తి (ఏనుగు) బీడీ ఫ్యాక్టరీలో, ఖడక్‌పుర.
- హజరత్ మౌలా మిష్కిన్ మసీద్, కొత్తపేట.
- ఖాదుమియా మసీద్, కొత్తపేట.
- మామూర్ మసీద్, సి.క్యాంప్ సెంటర్.
- అబ్బాస్ మసీద్, యూనిక్ స్కూల్ వద్ద, అబ్బాస్ నగర్.
- గౌసల్ ఆజం మసీదు, (కేవలం విద్యార్థుల కోసం), బీ.క్యాంప్, కర్నూలు.

సహెరీ సేవలు అభినందనీయం



ప్రతి ముస్లిం రంజాన్‌లో ఉపవాసాలు ఉండాలనే నిబంధన ఉంది. అయితే రోజా పాటించాలంటే సహెరీ తప్పనిసరి. విద్యార్థులు, ప్రయాణికులకు, ఉద్యోగులు, ఇళ్లలో స్త్రీలు లేని వాళ్లకు సహెరీ ఏర్పాట్లు చేసుకోవడం ఇబ్బందికరం. అయితే అలాంటి వారి కోసం ప్రతి రోజూ వంటలు చేసి పెట్టడం అభినందనీయం.
– షేక్ మహమ్మద్ రసూల్, హిందీ టీచర్

మహాపుణ్య కార్యం



ఉపవాస దీక్షలు పాటించే వారి కోసం సహెరీ ఏర్పాట్లు చేయడం మహాపుణ్య కార్యం. ప్రతి రోజూ అర్ధరాత్రి నిదుర మేలుకొని వంటలు వండి పెట్టడం అంటే సామాన్యమైన విషయం కాదు. దీక్షదారులు పాటించే రోజాలకు ముందు కడుపునింపడం అభినందించదగ్గ విషయం.
– ఎస్. ఇలియాస్ అహ్మద్, కర్నూలు

అల్లాహ్ వారికి ప్రతిఫలం ఇస్తారు



రోజాలు ఉండేందుకు సహెరీ ఏర్పాట్లు చేసి కడుపు నింపుతున్న స్వచ్ఛంద సంస్థలు, నిర్వాహకులకు అల్లాహ్ తప్పకుండా తగిన ప్రతిఫలం ఇస్తారు. ఇది ఎంతో పెద్ద పుణ్య కార్యం. సహెరీ చేసుకోలేక, తినలేక ఉపవాసాలు వదులుకునే పరిస్థితులు ఉంటాయి.
–హెచ్.లియాఖత్ బేగ్, కర్నూలు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని బుధవార పేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు ఇస్తున్న పౌష్టికాహారంతో పాటు జింక్, ఐరన్ మాత్రల పంపిణీ వివరాలను ఆయన పరిశీలించారు. రక్తహీనతకు సంబంధించి గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

గూడూరు రూరల్: ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో తప్పనిసరిగా కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఏపీఓ హసీనా సూచించారు. కె.నాగలాపురంలో చేపట్టిన ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల ప్రదేశాల్లో కూలీలు సేద తీరేందుకు షామియానాలు, తాగునీరు, ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ప్రతి కూలీకి ప్రభుత్వం రోజుకు వేతనం రూ. 257 ఇచ్చేదని ప్రస్తుతం అదనంగా రూ. 15ను పెంచి ఇస్తుందన్నారు. ప్రతి కూలీకి పూర్తి స్థాయి వేతనం పడే విధంగా పని చేయించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరులో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ పరిధిలోని వివిధ వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల్లో కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని వివరించి, ఇంటి యజమాని అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లు అంటించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని చెప్పారు. ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. అలాగే గత టీడీపీ పాలనకు, ప్రస్తుతం సీఎం జగనన్న పాలనకు గల తేడాను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, నాయకులు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రంగప్ప, జగదీష్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఆయా వార్డుల్లోని స్థానిక నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

- ఏపీజేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఏపీజేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి కేవై కృష్ణ, జిల్లా చైర్మన్ వి.గిరికుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏపీజేఏసీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు మలిదశ పోరాటంలో భాగంగా నల్లకండువాలు ధరించి కొండారెడ్డి బురుజు దగ్గర ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలంటూ తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. జీపీఎఫ్ గ్రాంట్లను వెంటనే ఉద్యోగుల ఖాతాలకు జమ చేయాలని, పీఆర్‌సీ బకాయిలు, అరియర్స్‌ను విడుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగుల వేతనాలను జమ చేయడంలో అలస్యాన్ని నివారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, నాగరాజు, మురళీకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు నిలిచిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి శనివారం ఇన్ ఫ్లో నిలిచిపోయింది. డ్యాంలో 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కోలుకోలేక వృద్ధుడి మృతి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో గూడ్స్ రైలు తగిలి తీవ్రంగా గాయపడిన వృద్ధుడు కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. భూపనపాడు గ్రామానికి చెందిన పశావుల చిన్న రామన్న (83) రెండు రోజుల క్రితం పాణ్యం వద్ద ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు పైలెట్ గమనించి ఆపాడు. ఈ ఘటనలో గాయపడిన రామన్నను 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. అయితే, మృతుడికి మతిస్థిమితం సరిగ్గా లేదని, వీపరితమైన చెవుడు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈమేరకు కుమారుడు పశావుల రామక్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య సరస్వతి, నలుగురు సంతానం.

పూలే జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

- జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఏ నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్): ఈ నెల 11వ తేదిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఏ నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా శనివారం తమ శాఖకు చెందిన అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు అమరావతి నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. కార్యక్రమానికి సంబంధించి పలు విషయాలను తెలుసుకున్న ఆయన ప్రోటోకాల్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, కార్యక్రమంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరగరాదని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమ నిర్వహణపై జిల్లా బీసీ సంఘాల నేతలతో డీఆర్‌ఓ సమక్షంలో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలను స్వీకరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే వేదిక ఏర్పాటు గురించి నగర పాలక సంస్థ అధికారులతో కూడా చర్చించామన్నారు. సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులు, కార్యాలయ ఉద్యోగులకు బాధ్యతలు కూడా అప్పగించామన్నారు. ఎక్కడా ఎలాంటి లోపం జరగకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

నిధులు నిరుపయోగం

కోడుమూరు: ఉల్లి గోదాములు నిరుపయోగంగా మారాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల జేబులు నింపేందుకు అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ నిధులతో కోడుమూరు, గూడూరు, కర్నూలు మండలాల్లో ఒక్కొక్క గోదాం కోటి రూపాయల వ్యయంతో నిర్మించారు. అయితే, ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతం రైతులకు అనుకూలంగా లేకపోవడంతో వారు ఉల్లిపంటలను నిల్వ చేసుకోవడంలేదు. అప్పట్లో కాంట్రాక్టర్లు, తెలుగుదేశం పార్టీ నేతలు కమీషన్లు దండుకొని హడావుడిగా పనులు పూర్తిచేశారు కానీ రైతులకు వాటి వల్ల ఎలాంటి ఉపయోగం జరగలేదు. గోదాముల నిర్మాణ వ్యయం అంచనాలను అధికంగా వేసుకొని నిధులను కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోడుమూరు, గూడూరు మార్కెట్‌యార్డు కేంద్రాల్లో నిర్మించిన ఉల్లి గోదాములు పూర్తిగా శిథిలమైపోయాయి. ఉల్లి పంటను గ్రేడింగ్ చేసుకునేందుకు నిర్మించిన డ్రైయింగ్‌యార్డులు సైతం పూర్తిగా పాడైపోయాయి. కోడుమూరు పట్టణ శివారులోని వెల్దుర్తి రోడ్డులో ఉన్న 20 ఎకరాల మార్కెట్‌యార్డు స్థలంలో నిర్మించిన రెండు షెడ్ల ఆవరణలో ప్రస్తుతం పిచ్చిమొక్కలు మొలిశాయి. ఉల్లి గోదాముల నిర్మాణాలకు ఉపయోగించే పైపులు స్రాబ్ నుంచి తీసుకొచ్చి బిగించారు. తుప్పుపట్టిన పాత పైపులతో షెడ్లు, రంగులు వేసి కాంట్రాక్టర్ బిల్లులు చేసుకున్నాడు. షెడ్ల కింద వేసిన కాంక్రీట్ పనులన్నీ శిథిలమైపోయాయి. నాసిరకంగా పనులు చేయడంతో కోడుమూరు, గూడూరు మార్కెట్‌యార్డు ఆవరణల్లో నిర్మించిన షెడ్లు కూలిపోయే పరిస్థితి ఉంది. గూడూరు గోదాం పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. అప్పట్లో నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఉల్లిపంటను నిల్వ ఉంచుకునేందుకు ముందుకు రాలేదు. 2015లో ఈ గోదాంలను నిర్మించారు.



అధ్వాన స్థితిలో ఉన్న ఉల్లి గోదాములు

ప్రతిపాదనలు పంపుతాం:

కర్నూలు నుంచి కోడుమూరు మార్కెట్ యార్డు ఈ మధ్య కాలంలోనే విభజన జరిగింది. యార్డులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. ఏడేళ్ల క్రితం నిర్మించిన ఉల్లి గోదాములు శిథిలమైపోయాయి. మరమ్మతుల కోసం ఉన్నతాధికారుల అనుమతితో నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపుతున్నాం. –సుంకారెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ

అందం అదిరేలా!

- సౌందర్యానికి ప్రాధాన్యతనిస్తున్న మగువలు
- వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్న వైనం
- బ్యూటీపార్లర్లు, బొటిక్‌లకు క్యూ
- ఉమ్మడి జిల్లాలో 2 వేలకు పైగా బ్యూటీపార్లర్ల నిర్వహణ

కర్నూలు కల్చరల్: ఒకే ఒక లోకం నువ్వే.. లోకంలోన అందం నువ్వే అన్నాడో సినీ కవి. అందమైన ప్రేమరాణి చెయ్యి తగిలితే సత్తురేకు కూడా స్వర్ణమేలే అని మరో కవి ఆలపించారు. అందమా.. నీ పేరేమిటి అందమా.. బాపూ గీసిన చిత్రమా.. అంటూ ఇంకో సినీ కవి ప్రశ్నించాడు. అందానికి ఎవరు ఎన్ని అలంకారాలు ఇచ్చినా.. ఉపమానాలు చూపినా అందమే ఆనందం అంటున్నారు అతివలు. మారిన జీవన విధానానికి అనుగుణంగా ట్రెండీ ఫ్యాషన్ అనుసరిస్తున్నారు. ముఖ్యంగా చీరలు, ఆభరణాలపై ఎంతో మక్కువ చూపుతున్నారు. ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా బ్యూటీ పార్లర్లు, బొటిక్‌లకు క్యూ కడుతున్నారు. కిట్టీ పార్టీల నుంచి పెళ్లిళ్ల వరకు ఏ శుభ కార్యమైనా మేకప్ అదరాల్సిందే. ఐ బ్రోస్ మొదలు కొని ఫేషియల్, స్టైల్ హెయిర్ కట్ వరకు ప్రత్యేకంగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటున్నారు. చీరకట్టు, ప్రత్యేక డిజైన్ల రెవికలతో వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా కనిపించేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారు.

అందానికి మరింత వన్నె

పెళ్లిళ్ల సీజన్‌లో నిశ్చితార్థం మొదలు కొని ఫొటో షూట్, పెళ్లి తంతు వరకు పెళ్లి కూతురిని తయారు చేసేందుకు బ్యూటీషియన్లతో ముందుగా ఒప్పందం చేసుకుంటున్నారు. బ్రైడల్ మేకప్, శారీ డ్రాపింగ్, కేశాలంకరణ, ఇలా మేకప్ విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ప్రతి శుభకార్యానికి ముందస్తు వేడుక ఇప్పుడో ట్రెండ్. మహిళల అభిరుచికి అనుగుణంగా బ్యూటీషియన్లు వారి అందానికి మరింత వన్నె తెస్తున్నారు.

మేకప్ ప్యాకేజీలు ఇలా..

ఐ బ్రోస్, నార్మల్ వాక్స్, రికా వాక్స్, ఫేషియల్, మానిక్యూర్ అండ్ పెడిక్యూర్, హెయిర్ కట్, హెయిర్‌స్టైల్, హెయిర్ స్పా, హెయిర్ స్మూతెనింగ్, హెయిర్ రీబాండింగ్, ఎలక్ట్రాలసిస్ ట్రీట్‌మెంట్, కెరటిన్, వాట్స్, మేక్‌ఓవర్, గాల్వనిక్ ట్రీట్‌మెంట్, అల్ట్రాసోనిక్ ట్రీట్‌మెంట్, టెంపరరీ ఐరోనింగ్, సింపుల్ మేకప్, పార్టీ మేకప్, శారీ డ్రాపింగ్, బ్రైడల్ మేకప్, అడ్వాన్స్ ఫేషియల్ లాంటి వెరైటీలు ఉన్నాయి. సింగిల్, ప్యాకేజ్, హోమ్ సర్వీసెస్ ద్వారా మగువలు వారి అందాన్ని మరింత మెరుగు పరుచుకుంటున్నారు. మేకప్ రకం, వాడే మెటీరియల్‌ను బట్టి రూ.500 మొదలు కొని రూ.8,000 వరకు ధర ఉంటుంది. బ్రైడల్ ప్యాకేజ్ రూ.6 నుంచి 8 వేలు వరకు ఖరీదు ఉంటోంది.

డబ్బు కొద్దీ డిజైన్ :

చీరకు తగ్గట్టు మ్యాచింగ్ డిజైన్ జాకెట్లతో సరిపెట్టుకునే మహిళలు నేడు వాటికి జిలుగుల సొబగులు అద్ది సీతాకొక చిలుకల్లా మెరిసిపోతున్నారు. అల్లికలు, పూలు, గాజులు, రంగురాళ్లు తదితర మెటీరియల్‌తో వినూత్న డిజైన్లకు పెద్ద పీట వేస్తున్నారు. మగ్గం వర్కు, మిషన్ ఎంబ్రాయిడరీ వర్కు, వైల్ డూయింగ్ వర్కు, కట్ వర్కు ఇలా ఎన్నో ఉన్నాయి. జాకెట్టు డిజైన్ వాడిన మెటీరియల్ బట్టి రూ.1000 నుంచి రూ.10,000 వరకు ఖరీదు ఉంటుంది. ప్రత్యేకమైన రంగు రాళ్లతో తయారు చేసే జాకెట్ల ఖరీదు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుంది. ఆభరణాల్లో వాడే జార్కన్ స్టోన్స్‌తో తయారు చేసే జాకెట్ల ఖరీదు రూ.లక్ష వరకు పలుకుతున్నాయంటే అతిశయోక్తి కాదు.

వేల మందికి ఉపాధి :

ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్రంతో పాటు నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, నందికొట్కూరు లాంటి ప్రాంతాల్లో సుమారు 2200 బ్యూటీ పార్లర్లు, బొటిక్‌లు ఉన్నాయి. కర్నూలు సిటీలో సుమారు 1050, నంద్యాలలో 650, ఆదోనిలో 550 పార్లర్లు ఉన్నాయి. వీటికి రోజుకు పదుల సంఖ్యలో, శుభకార్యాల సీజన్‌లో మరింత ఎక్కువ మంది వస్తుంటారు. రోజుకు సుమారు రూ.60 లక్షల బిజినెస్ జరుగుతోంది. నెలకు సుమారు అందానికి సంబంధించే రూ.18 కోట్లు వరకు వెచ్చిస్తున్నారు. దీనిపై ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 15 వేల మంది ఉపాధి పొందుతున్నారు.



ఫేషియల్ చేస్తున్న బ్యూటీషియన్

బ్యూటీపార్లర్లకు రావడం పెరుగుతోంది



కర్నూలు నగరంలో 2005 నుంచి బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నాం. బ్యూటీషియన్ శిక్షణ ఇస్తున్నాం. గత పది సంవత్సరాల క్రితానికి ఇప్పటికి బ్యూటీ పార్లర్లు, బోటిక్ సెంటర్లు చాలా పెరిగాయి. అందానికి ప్రాధాన్యత పెరగడంతో మహిళలు బ్యూటీ పార్లర్లకు రావడం బాగా పెరిగింది. చిన్న చిన్న వేడుకలు ఉన్నా లైట్ మేకప్, ఫేషియల్ చేయించుకోవడం సాధారణమైంది.
– సృజన, సీనియర్ బ్యూటీషియన్, గాంధీనగర్, కర్నూలు

ట్రెండ్‌కు అనుగుణంగానే..



ప్రస్తుతం మహిళలు అందానికి ప్రాధాన్యం ఇవ్వడం పెరిగింది. మారుతున్న ట్రెండ్‌ను ఫాలో కావాల్సిందే. కొత్తదనాన్ని ఆస్వాదించాల్సిందే. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నాం. దాంతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులను ఆహ్వానిస్తున్నాం. సిటీల్లో ఉన్న ఫ్యాషన్ కల్చరల్ క్రమంగా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. వేడుకలు ఉన్నా లేకపోయినా నెలకొకసారి బ్యూటీ పార్లర్‌కు వచ్చి వెళ్లడం పెరిగింది. ఉన్న అందానికి కాస్త మెరుగులు దిద్దుకుంటే మరింత ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లగలుగుతాం. – ఆర్తి, కర్నూలు

రామాయణం ఆదర్శం

పాణ్యం: రామాయణం మానవజాతికి ఆదర్శం అని టీటీడీ ధర్మ ప్రచారక్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకట్‌రెడ్డి అన్నారు. గోనవరం గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక సంస్కృతి కార్యక్రమాల ముగింపులో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, గోపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచి నైతిక విలువల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో శివరామిరెడ్డి, పక్కిరారెడ్డి, వెంకట శేషయ్య, రామసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, శేషిరెడ్డి హనుమంతు పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టును నిలిపేయాలి

నందవరం: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నదిపై అప్పర్‌భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపేయాలని ఆర్‌పీఎస్ రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు సీమ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయలసీమ హక్కుల సాధనకు ఈ నెల 24న కర్నూలులో జరిగే ఒక్క రోజు నిరసన దీక్షకు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలని, అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మించడంతో రాయలసీమకు తుంగభద్ర నది నుంచి రావాల్సిన నికర జలాలు హెచ్ఎల్‌సీ, ఎల్లెల్సీ, కేసీ కెనాల్ బైవారణి తిప్ప ప్రాజెక్టు రైతులకు రావన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టు నిర్మాణం నిలిపేయాలన్నారు. శ్రీబాగ్ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేసి నీళ్లు, నిధులు, నియామకాలలో న్యాయం చేయాలని కోరుతూ నిర్వహించనున్న దీక్షలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు హరి నాయుడు, నాగభూషణం, గోపాల్, సురేంద్రరెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.